నోరూ వాయీ లేని ప్రజల్ని - దేశోద్ధారకులయిన దేశభక్తుల్ని అన్నివిధాల హింసించిన :

# పోలీసులు రాక్షసులు కారూ ?—

“పోలీసు...పోలీసు”

నలుగురు పిల్లలూ కేకలు వేస్తున్నారు.

పదేళ్ళకితం మా ఊర్లో, మీ ఊర్లో ఎర్రటోపీ కనబడితే, భయంతో ఇళ్ళతలుపులు మూసుకునేవి. ఆ ఎర్రటోపీ పొలిమేర దాటేదాకా గ్రామస్తుల గుండెలు పీచుపీచుమనేవి. 1930 లో అప్పుడే దేశభక్తి మొలకెత్తుతున్న 'కుర్రకుంకలు' దూరాన్నుంచే ఆ టోపీని చూసి, రాట్నాలను గడ్డివాముల్లో దాచి, అటకలెక్కి కూర్చొనేవారు.

ఈ పది, పదిహేనేళ్ల కాలంలో చాలా గ్రంథం నడిచింది. ఆ 'కుర్రకుంక'ల్లో కొంతమంది సెంట్రల్ జైళ్లకి వెళ్లి వచ్చారు.

ఇప్పుడీ పిల్లలు వస్తున్న పోలీసును చూసి, నిర్భయంగా గోలచేస్తున్నారు.

ఆ పోలీసు ఈ ఇంటికి కొత్తవాడు. ఇంటి యజమాని సబ్ జైలులో పరిచయం అయాడు. 1930 లో ఈ గ్రామం వచ్చినప్పుడల్లా ఆ పోలీసు ఈ ఇంట్లోనే భోజనం చేసేవాడు.— యజమాని ఊర్లో ఏమి 'రాజద్రోహం' చేస్తున్నాడో తెలుసుకోటానికని వచ్చి.

క్రమేపీ ఎర్రటోపీకి గాంధీటోపీకి స్నేహం హెచ్చు అయింది. సంకెళ్ల స్నేహం.

వయోభారంతో నడుంవంగుతున్న పోలీసు, చుట్టూ మూగిన పిల్లలను చూసి 'జై హింద్' అని జవాబిచ్చాడు. పిల్లలంతా 'జై హింద్...గాంధీజీకి జై...పండిత జవహర్లాల్ నెహ్రూకీ జై...' అని నినాద - దండకాన్ని దసరాపద్యాలకంటె బాగా వల్లించారు.

'నాన్నగారు...లేరు...ఊర్లో.'

..........

'ఆ...ఏదో పండగ అని వచ్చాను' అంటూ వసారా మెట్టకానుకొని కూలబడ్డాడు.

'సహజానంద'

ఆ ముసలిపోలీసు పిల్లలకేసి చూసి, 'ఇదిగో చూశారా లాఠీ' అన్నాడు. పిల్లలతోపాటు తానూ నవ్వాడు.

“ఏం బాబూ స్వరాజ్యం వచ్చింది ఆ కాల్పులు...లాఠీదెబ్బలు...” అని పోలీసింకా ఏమో అడగబోతుండగా, ఇంట్లోంచి గంయ్యిమని గంతేస్తూ, బైటికి దూసుకొచ్చిన ఇద్దరు కుర్రవాళ్లు ధనుస్సులు గురిచూసి తబ్బిబ్బు అవుతున్న పోలీసు ముఖం మీద గులాం కొట్టారు. విజయోత్సాహంతో ఆ కుర్రవాళ్ళిద్దరు మళ్లీ బాణాలు లంఘించబోతున్నారు.

“మీకో నమస్కారం బాబూ, మీరే గెల్చారు లెండి, మీరే గెల్చారు” అని ముఖం తుడుచుకొని, పోలీసు మళ్లీ ప్రసంగం ఆరంభించాడు.

'ఆ కాల్పులు...'

ముసలి గొంతు గత స్మృతిలో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. పాతికేళ్లు లాఠీ, తుపాకి, ఈల, బేడీలు, జైలు కాపలా ..ఇవే జీవితమైపోయినయ్.

“కాలమహిమ ! వళ్లుపై తెలియకుండా కొట్టే వాళ్ళం, ఆ 'సత్యాగ్రహు'లివ్వాళ దొరలయారు. ఆ జెండాను కిందకు లాగి, చింపి పారవేసే వాళ్లం, అదివ్వాళ దేశమంతటా ఎగురుతోంది. మొన్ననే మేమంతా ఆ జెండాకు 'సాల్యూట్' చేశాం. ఆ రోజున, ఆ స్వాతంత్ర్య...ఆగస్టు 15 వ తేదీన మా సభకు సత్యాగ్రహి మా ఊర్లో ఒకాయన 'ప్రెసిడెంటు'...కాలం మారిపోయింది”

“ఇప్పుడు మీ పోలీసులు కళ్లు తెరుస్తున్నారు.”

“అదే బాబూ ఏమిటివంతా నాకేమీ తెలీటం లేదు.”

నాన్నగారు పదిహేనురోజులు మా సబ్ జైలులో ఉన్నప్పుడు-మేం నవ్వుకున్నాం, 'ఇదేం పిచ్చ !' అని.

5 యేళ్ళ కితం, అప్పుడు చాలా గందరగోళం గా ఉంది. మమ్మల్ని బస్తీకి మార్చారు. పారుగ్గేటుపైపు గురిపెట్టి, తుపాకులు పేల్చాం, సంజ చీకట్లో పచ్చని గరికపై రక్తం కురిసింది.

తర్వాత, మేం మా 'లైను'లకు వెళ్ళాం, కానీ పటికి కేవరో పదిమంది మా 'లైను'లోకి ఓ శవాన్ని మోసుకొచ్చారు, మా అన్నయ్యకొడుకు."

పోలీసు కళ్లు చెమ్మగిల్లినయ్.

"నీ కెంతమంది పిల్లలు ?" అని ఇంట్లో ముసలమ్మ అడిగింది.

"ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు - పెల్లాళ్ళ కితం మొదటివాడు 'టైఫాయిడ్' వచ్చి పోయాడు."

"రెండోవాడేం చేస్తున్నాడు"

"వాడేదో ఈ స్వరాజ్యంవారితో తిరుగుతూ వుంటాడు. మా ఇంటిమీద జెండా ఎగరేశాడు అప్పుడు మా ఇంటావిడ అంది."

"మరి తుపాకి పేల్చలేం ?" అని.

"30 లో మే మొక పట్నంలో ఉన్నాం, ఓ కుర్రవాడు తాలూకాకచేరీ స్తంభంమీద జెండా కట్టుతున్నాడు. కిందనుంచి మేం ఎన్నిసార్లు కేకలు వేసినా విన్పించుకోలేదు, మూడుసార్లు హెచ్చరించాం, చుట్టూ జనసమ్మర్దం మమ్మల్ని చుట్టు ముట్టుతున్నారు. మా ఇన్స్పెక్టరు పిస్టల్ పేలింది. స్తంభం కుదుట్లోకి ఆ కుర్రాడు పడ్డాడు. పోలీసు 'లైను'లోంచి మా ఆడవాళ్లంతా ఆ దృశ్యం చూశారు. ఆ తుపాసురోజుల్లో మా ఆడవాళ్లు పుట్టింటికి వెళ్ళిపోయేవాళ్లు."

కాసేపు మౌనంగా ఉండి పోలీసు మళ్లీ ఆరంభించాడు.

"వెధవ బతుకు మంది, పాడు బతుకు, మేం రాక్షసులమనే అందరూ అనుకోటం, మరి మేం చేసేవి రాక్షసపు పనులే" అని తనలో తానేదో ఆలోచించుకుంటూ పోలీసు మౌనం వహించాడు.

పండగకు పొరుగింటికి వచ్చిన యువకుడు పిల్లల గంతు విని వచ్చాడు.

"పోలీసు అంటే రాక్షసుడేనా, బాబూ."

ఆ యువకుడుకూడా సంభాషణలో పాల్గొన్నాడు.

"రాక్షసుడు కాదు, ఇతరులతో సమానమైన వాడే.

స్వరాజ్యం వచ్చేదాకా మీరు శత్రువులతో కలసి పని చేశారు. ఇది నిజానికి ద్రోహం, ఇంకో దేశంలో అయితే, స్వరాజ్యం వచ్చాక మిమ్మల్ని."

పోలీసు ఆశ్చర్యపోయి చూస్తున్నాడు.

"మా అధికార్లు చెప్పినట్టు చేశాం, మరి మేం బతికే దెల్లా ?"

"ఇదే మీ నేరం, ఇకనైనా కళ్ళు తెఱచి ఆకలికంటే ఆత్మగౌరవం ఎక్కువ అని తెలుసుకోండి. దుష్టుల అధికారంకోసం, ఇన్నేళ్లూ నోరూ వాయీ లేని ప్రజల్ని, దేశోద్ధారకులైన దేశభక్తుల్ని అన్నివిధాల హింసించారు."

"స్వరాజ్యం వచ్చిందిగా."

"వచ్చింది, కాబట్టే అసలు చరిత్ర ముందుంది. కోటానుకోట్లు ఈ నాడు దుర్భరదారిద్ర్యంలో కాటికి కాళ్లు చాచుకుంటున్నారు. వారికి దారిద్ర్య-విముక్తి కావాలి. అప్పుడుగాని ఈ స్వాతంత్ర్యజ్యోతి వారి గుడిసెల్లో వెలగదు."

పోలీసు నిశ్చలంగా యువకుని ఉపన్యాసాన్ని, ప్రబోధాన్ని వింటున్నాడు.

"మీరు మామూలుగా ఈ ప్రజల్ని లాఠీలతో కొట్టి, బేడీలు తగిలించి, జోనుల్లో నిలబెట్టుతూ ఉంటారు. వీరు నిర్దోషులు, వీరి నేరమల్లా జీవించి ఉండటమే.

ఇక ముందు వారిపై కాదు లాఠీ, వారి గుండెల్లోకి కాదు తుపాకిగుండు, వారికి కాదు జోను.

ఇక వారిదే రాజ్యం..."

ఉద్రేకపూరితమైన పొరుగింటి యువకుని ఉపన్యాసం విని పోలీసు మెల్లగా లేచాడు.

"మళ్లీ వస్తా బాబూ, నాన్నగారు వచ్చాక" అని వెళ్ళిపోతున్నాడు.

బజార్లలో పిల్లలంతా గోలచేస్తున్నారు. మెల్లగా అడుగులు వేసుకుంటూ ముసలిపోలీసు వీధిలోకి వెళ్తున్నాడు. ఊరు నలువైపుల ఉన్న గుడిసెలపై జెండాలు ఎగురుతున్నయ్.

పిల్లలు బాణాలు ఎక్కుపెట్టారు. గాలిలో గులాం ఎర్రగా మెరుస్తోంది.

పోలీసు వీధిచివరకు చేరుతున్నాడు. జనం అతనికేసి చూడలేదు. పండగ పరవశంలో వాళ్లకు పోలీసు కన్పించలేదు. మరి, మరి...

"ఇక వారిదే రాజ్యం."